## ఇది శాసనమండలి హృదయ వేదన

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ మధుసూదనాచారి బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబరు31:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి స్వదస్తూరితో బహిరంగ లేఖ రాశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపేందుకు శాసన మండలిని సమావేశపరచక పోవడం బాధాకరమని మధుసూదనాచారి మంగళవానం తన లేఖలో పేర్కొన్నారు. పెద్దల సభకు సుదీర్ఘ కాలం పని చేసిన మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రంలోని పెద్దల సభ సంతాపం తెలిపితే సముచితంగా ఉండేదని ఆయన తెలిపారు. ఇది తన అభిప్రాయం కాదు శాసనమండలి హృదయ వేదన అని మధుసూదనాచారి పేర్కొన్నారు. శాసన మండలిని చిన్న చూపు చూడటం తగదు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదు అని రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మధుసూదనాచారి సూచించారు.

## వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి స్క్రీనింగ్ టెస్ట్

### వర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపుపై చర్చ

### మంగళవారం సమావేశమైన కమిటీ, 25లోగానప్రభుత్వానికి నివేదిక

**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో యూనివర్సిటీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం ప్రభుత్వ అనుమతితో డిసెంబర్ 13న జరిగిన వీసీల సమావేశంలో ముగ్గురు వీసీలతో ఉన్నత విద్యా మండలి కమిటీని నియమించగా.. మరో ఇద్దరు నిపుణులను కమిటీలో చేర్చాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకం తోపాటు.. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు పెంపుపై కూడా కమిటీ చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించనుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి కమిటీ ఛైర్మన్‌గా, మహాత్మా గాంధీ వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, ఓయూ లా డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి, మరో ప్రొఫెసర్ ఎం చెన్నబసవయ్య కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. కమిటీ మంగళవారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మొదటి సమావేశం జరిగింది. సమావేశంలో ప్రాథమికంగా పలు అంశాలను చర్చించినట్టు తెలిసింది. మరో రెండు, మూడు విడతల్లో సమావేశాలను కొనసాగించి ఈ నెల 25లోపుగా ప్రభుత్వానికి తమ ప్రతిపాదనలను పంపించనున్నట్టు తెలుస్తోంది. కమిటీ ఇతర రాష్ట్రాల్లో వ్యవహారిస్తున్న తీరును పరిశీలించనుంది. జీవో ఎంఎస్ నంబర్ 15కు అనుగుణంగా బోధనా సిబ్బంది నియామకానికి సంబంధించిన విధివిధానాలను సిద్ధం చేయడానికి కమిటీని ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఇందుకు సంబంధించిన విధివిధానాలను పరిశీలించనున్నారు. అలాగే నియామకాలకు సంబంధించి రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలా? లేకపోతే కమిషన్‌ను ఏర్పాటు చేయాలా? రెండూ కాకపోతే నియామక ప్రక్రియను టీజీపీఎస్సీకి అప్పగించాలా?వంటి పలు అంశాలను కమిటీలోచర్చించినట్టు తెలిసింది.రాష్ట్రంలో విద్యా శాఖ పరిధిలో కొనసాగే సుమారు 12 యూనివర్సిటీల్లో నియామకాలకు సంబంధించిన ప్రక్రియను చేపట్టనున్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో సుమారు 1060కి పైగా అధ్యాపక పోస్టులు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం, ఫైనాన్స్ శాఖ అనుమతించినప్పటికీవివిధకారణాలతో నియామక ప్రక్రియ కొనసాగలేదు. దీంతో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్నఅసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక జరగలేదు. ఈనేపథ్యంలో ఎలాగైనా వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి నియామక ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలనే యోచనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.

## యేడాదిలో 11 సహకార బ్యాంకుల లైసెన్సులు రద్దు

### బ్యాంకింగ్ చట్టాలు అమలుకాకపోవడమే మూలం



**ముంబయి, డిసెంబరు 31:** బ్యాంకింగ్ చట్టాలను పాటించకుండా నిబంధనలు ఉల్లంఘించి డిపాజిటర్లకు ఆందోళన వ్యక్తంచేస్తున్న 11 బ్యాంకుల లైసెన్సులను భారతీయ రిజర్వుబ్యాంకుఈ ఏడాది కాలంలో రద్దుచేసింది. వాటిలో మెజార్టీ బ్యాంకులు సహకార రంగంలో ఏర్పడినవి కావడం గమనార్హం. ఒక్క ఏడాదిలోనే 11 బ్యాంకుల లైసెన్సులు రద్దయ్యాయి. ఖాతాదారులు డిపాజిట్లు కొంత పరిమిత మొత్తం మాత్రమే విత్‌డ్రాచేసేందుకు అవకాశం ఉంది. దీనితో ఇపుడు డిపాజిటర్లలో ఆందోళన పెరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన బ్యాంకులపై రిజర్వుబ్యాంకు 1949 నాటి బ్యాంకింగ్ చట్టం నిబంధనలను అనుసరించి వాటిపై జరిమానా విధించడం లేదా లైసెన్సులు రద్దుచేయడం వంటివి చేస్తుంది. ఇపుడు దేశవాప్తంగా మొత్తం 11 బ్యాంకుల లైసెన్సులు రద్దుచేసింది. ఈ బాంకులకు తగినంత మూలధనం లేదని, రాబడుల అవకాశాలు కూడా లేవని ఆర్‌బిఐ అంచనావేసింది. ఈపరిస్థితుల్లో బ్యాంకింగ్‌చట్ట నిబంధనలు ఉల్లంఘించిందని భావించి లైసెన్సులు రద్దుచేసినట్లు తెలిపింది. అంతేకాకుండా ఈ బ్యాంకులు డిపాజిటర్ల సొమ్మును కూడా చెల్లించేపరిస్థితి లేదని, ప్రజాశ్రేయస్సు, ఇన్వెస్టర్లు, డిపాజిటర్ల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వాటి లైసెన్సులను రద్దు చేస్తున్నట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. వీటిలో ఆంధ్ర ప్రదేశ్ విజయవాడకు చెందిన దుర్గా సహకార అర్బన్ బ్యాంకు, గుజరాత్‌లోనిధబోయిలో శ్రీ మహాలక్ష్మి మర్కంటైల్ సహకార బ్యాంకు,కర్నాటకలోని హిరియార్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు, మహారాష్ట్ర బసమత్‌నగర్‌లోని జైప్రకాష్ నారాయణ్ నగరి సహకారి బ్యాంకు, రాజస్థాన్‌లోని పాలి సుమేర్‌పూర్‌లో ఉన్న సుమేర్‌పూర్ మర్కంటైల్ అర్బన్ సహకార బ్యాంకు, యుపి ఘాజీపూర్‌లోని పూర్వాంచల్ సహకార బ్యాంకు, మహారాష్ట్ర ముంబయిలోని సిటీ సహకార బ్యాంకు, వారణాసిలోని బనారస్ మెర్కంటైల్ బ్యాంకు, కర్నాటకలోని మండ్యా జిల్లాలోని మద్దూర్ ప్రాంతానికి చెందిన శింషా సహకారి బ్యాంక్ నియమిత్రా, ఎపిలోని అనంతపురం జిల్లాలో ఉన్న ఉరవకొండ సహకార పట్టణ బ్యాంకు, అస్సాంలోని తేజ్‌పూర్‌లో ఉన్న మహాభైరబ్ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకుల లైసెన్సులను రద్దుచేసింది. ఇపుడు డిపాజిటర్లు డిఐసిజిసి 1961 చట్టంప్రకారం బ్యాంకుల లైసెన్సులు రద్దయితే ప్రతి ఖాతాదారు తన డిపాజిట్ సొమ్మును అనుసరించి ఐదులక్షల వరకూ డిపాజిట్ బీమా క్లెయిమ్ పొందలగుగుతాడు. ఈ మొత్తం డిపాజిట్ ఇన్సూరెన్స్ గ్యారంటీ కార్పొరేషన్ సమకూరుస్తుంది.

### న్యూఇయర్ విషెస్ పేరిట ఫోన్లకు లింకులు పంపి

## మోసాలకు సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ

### ఆదమరిస్తే అంతే సంగతులు.. జాగ్రత్తగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా మొదలైన కొత్త ఏడాది సంబరాల వేళ సైబర్ నేరగాళ్లు దీనిని తమకు అనుకూ లంగా మార్చుకుంటూ అమాయకుల బ్యాంకుల ఖాతాలను ఖాళీ చేసేందుకు వ్యూహాలు సిద్ధం చేశారు. ఈ తరహా మోసాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని సైబర్ సెక్యూరిటీ పోలీసులు హెచ్చరించసాగారు. మీరు మీ బంధువులు, స్నేహితులు, సన్నిహితులకు కొత్త ఏడాది శుభా కాంక్షలు చెప్పాలనుకుంటే మేము మీకు సహాయం చేస్తాం మేము మీ ఫోన్లకు పంపే లింకులపై క్లిక్ చేస్తే చాలు అంటూ సైబర్ నేరగాళ్లు ఒకేసారి లక్షలాది సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపుతున్నారు. ఇందులో నిజం వుందని కొందరు నమ్మే వీలుండడంతో ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు రెడీ అవుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా మోసాలు కొన్ని జరిగినట్లు ఫిర్యాదు అందడంతో దీనిపై అప్రమత్తమైన సైబర్ సెక్యూరిటీ పోలీసులు ప్రజలు జాగ్రత్తగా వుండాలని హెచ్చరించసాగారు. దీనిపై రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబు మంగళవారం ఏకంగా మీడియా సమావేశం నిర్వహించి మరీ ప్రజలు జాగ్రత్తగా వుండాలని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు పంపే లింకులను ఓపెన్ చేసినా, క్లిక్ చేసినా మీ బ్యాంకు ఖాతాల వివరాలు, సెల్‌ఫోన్లలోని వివరాలు నేరగాళ్లకు చేరిపోతాయని, దీని తరువాత క్షణాల్లో బ్యాంకుల్లోని డబ్బంతా సదరు నేరగాళ్లు కాజేస్తారని, ఆ తరువాత ఏమీ ప్రయోజనం వుండదని ఆయన తెలిపారు. ఈ విషయంలో అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని సుదీర్ బాబు కోరారు. ఇదే సమయంలో డిస్కౌంట్ కూపన్లు, న్యూ ఈయర్ పాసులు, ఆకర్షణీయమైన చిత్రాలు, ఉచితంగా ఇటీవల విడుదలైన హిట్ సినిమాలు, ప్రీ ఈవెంట్ కూపన్లు వంటివి కూడా ఫోన్లలో సైబర్ నేరగాళ్లు పంపుతూ ప్రజలను ముంచేందుకు ప్రయత్నిస్తున్నందున దీనిపైనా అందరు జాగ్రత్తగా వుండాలని సైబర్ సెక్యూరిటీ పోలీసులు కోరసాగారు. ఈ తరహా మోసాలపై వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలని వారు కోరారు.

## సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై మాజీ ఎంపీ వినోద్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు31:** తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే సైనిక్ స్కూల్స్‌పై విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి బిఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ లేఖ రాశారు. ఈ లేఖలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటుపై గత బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటి అనేది లేఖలో ప్రస్తావించారు. అంతేగాక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను, అనుసరించాల్సిన విధానాలను వివరిస్తూ ఆకునూరి మురళికి పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలను వినోద్ రాసినలేఖలో వివరించారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని,ప్రభుత్వం ఇప్పటికే కేంద్రం వద్ద పలు మార్లు ప్రతిపాదనలు పెట్టింది.

## తన ఎక్స్‌ఖాతా ప్రొఫైల్ మార్చిన మస్క్

### ప్రొఫైల్‌పేరును కెకియస్ మాగ్జిమస్‌గా మార్పు

### క్రిప్టోకాయిన్‌పై తన మక్కువను చాటిన బిలియనీర్



**న్యూయార్క్, డిసెంబరు 31:** బిలియనీర్ ఎలాన్ మస్క్ తన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో తన ప్రొఫైల్ పేరునే మార్చేసుకున్నారు. ఇప్పటివరకూ ఎలాన్ మస్క్‌గానే పరిచయం ఉన్న మస్క్ ఇపుడు ఈ మాజీ ట్విట్టర్‌ప్రొఫైల్‌లో కెకియస్ మాగ్జిమస్ అనే పేరును చేర్చారు. అంతేకాకుండా తన ఎక్స్ ప్రొఫైల్ చిత్రాన్ని కూడా మార్చివేసారు. కొత్తగా పెపేది ఫ్రాగ్ అన్న పేరిట ఒక వీరునితరహాలో ఉన్న కప్ప మెమెను పోస్టు చేసారు. ఈ పెపే పాత్ర కూడా ఒక జాయ్‌స్టిక్ చేతబట్టి విడియోగేమ్ ఆడుతున్నట్లుగా చూపించారు. ఆన్‌లైన్‌లో తన ఉనికిని విచిత్ర రీతుల్లో చాటిచెప్పే మస్క్ ప్రతి ఏటా కూడా ఈ ప్రయోగాలు చేస్తున్నారు. క్రిప్టోకరెన్సీలో కీలక పేర్లుగా భావిస్తున్న వాటిని మస్క్ తన ప్రొఫైల్ పేర్లుగా పెట్టారు. క్రిప్టోకరెన్సీలో కెకియస్ మాగ్జిమస్ ఇటీవలికాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రిప్టోకరెన్సీ విభాగంగా వాడుకలోకి వచ్చింది. క్రిప్టో కరెన్సీ పేరును తన ప్రొఫైల్‌కు మస్క్ మార్చిన కొన్ని క్షణాల్లోనే ఈ బిట్‌కాయిన్ 500శాతంపెరిగింది. గ్లాడియేటర్ చిత్రంలోని మ్యాగ్జిమస్ పాత్రను పోలిఉండే విధంగా పెపె ది ఫ్రాగ్‌ను తీర్చిదిద్ది మరీ తన ప్రొఫైల్ చిత్రానికి జోడించారు. కెకిస్‌క్రిప్టో టోకెన్‌కు మస్క్ విపరీతంగా ఆకర్షితులయ్యారని చర్యలు స్పష్టంచేస్తున్నాయి. ఇంటర్నెట్ సంస్కృతిలో ఇటీవలికాలంలో డీసెంట్రలైజ్డ్ ఫైనాన్స్ అంటే మస్క్ భాషలో డెఫిగా పిలుస్తారు. వాడుకలో క్రిప్టో కాయిన్‌లకు మంచి మార్కెట్ లభిస్తోంది. ఇపుడు మస్క్ చర్యలతో ఈ కెకియస్ క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో ప్రకంపనలు సృష్టించిందనే చెప్పాలి.

## బౌన్సర్‌లా ప్రవర్తించిన రాహుల్

### బిజెపి ఎంపి ప్రతాప్ చంద్ర

**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** పార్లమెంట్ ఆవరణలో డిసెంబర్ 19న ఎంపిల మధ్య తోపులాట జరిగిన ఘటనలో బిజెపి ఎంపిలు ప్రతాప్‌చంద్ర షడంగి, ముకేశ్ రాజ్‌పుత్ గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై తాజాగా గాయపడిన వారిలో ఒకరైన ప్రతాప్‌చంద్ర షడంగి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ ఆవరణలో తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే రాహుల్ ఒక ఎంపిలా కాకుండా బౌన్సర్‌లా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి లాంటి గొప్ప వ్యక్తులు లోకసభలో విపక్షనేతలుగా వ్యవహరించారని అలాంటి పదవిలో కొనసాగుతున్న రాహుల్ ఈ విధంగా ప్రవర్తించడం సరైనది కాదని అన్నారు. తోపులాటలోగాయపడిన తాను డిసెంబర్ 28న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యానని తెలిపారు. ప్రస్తుతం తనఆరోగ్యం మెరుగ్గానే ఉందని తలపై పడిన కుట్లు ఇంకా మానకపోవడంతో జాగ్రత్తలు తీసుకుంటున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో అంబేద్కర్‌ను అమిత్‌షా అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి.

## సెక్రటేరియట్‌లో ఉద్యోగుల సంఘం ఎన్నికల వార్

### అభ్యర్థుల ప్రచార హోరు, జనవరి 4న పోలింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు31:** సెక్రటేరియట్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్నది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు తీవ్రంగా కష్టపడుతున్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి ఓటరును వ్యక్తిగతంగా కలుస్తున్నారు. దీంతో సెక్రటేరియట్ మొత్తం ఎన్నికల సందడి నెలకొన్నది. మరోవైపు ఎంప్లాయీస్ వాట్సప్ గ్రూపుల్లో ఆకట్టుకునేవిధంగా పోస్టింగ్ పెడుతున్నారు. జనవరి 4న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు పోలింగ్ జరగనుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొదటిసారి సెక్రటేరి యట్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఎవరు గెలుస్తారనే ఆసక్తి ఉద్యోగుల్లో నెలకొన్నది. మొత్తం 1104 మంది ఓటర్లు ఉండగా, 11 పోస్టుల కోసం 67 మంది పోటీ చేస్తున్నారు. ప్రధానంగా ప్రెసిడెంట్,జనరల్ సెక్రటరీ పోస్టులకు తీవ్ర పోటీ ఉంది. అయితే ప్యానల్‌తో సంబంధం లేకుండా విడిగా చాలా మంది ఎంప్లాయిస్ బరిలోకి దిగ డంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ మొదలైంది. అభ్యర్థులు ప్రతి డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి,అక్కడ పనిచేస్తున్న ఎంప్లాయిస్‌ను విడిగా కలిసి ఓటు వేయాలని కోరుతున్నారు. ఇప్పటికే ఒక్కో ఓటరును రెండు, మూడుసార్లు కలుస్తున్నారు. మరోవైపు ఎంప్లాయిస్ వాట్సప్ గ్రూపుల్లో ఆకట్టుకునేందుకు పాంప్లెట్స్,కొటేషన్స్ పెడుతూ మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గపడుతుండటంతో ఓటర్లకోసం పెద్ద ఎత్తున దావత్‌లు ఇవ్వడం ప్రారంభించినట్లు సమాచారం. గత వారం వరసగా సెలవులు రావడంతో ఎంపిక చేసిన ఓటర్లకు అభ్యర్థులు సిటీ శివారులో పార్టీలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. కొందరు అభ్యర్థులు లక్షల్లో ఖర్చు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. అసెంబ్లీలో కూడా ఓటర్లు ఉండటంతో అభ్యర్థులు వచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఉద్యోగులు ఓట్లు వేసేందుకు పోలింగ్ రోజు శాసనమండలి ఆవరణలో ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయనున్నారు.

## రోడ్డుపై ఇనుపబోర్డు..వరుసగా 50 వాహనాలు పంక్చర్!

### ముంబయి రోడ్డులో రాత్రివేళ ఘటన

**ముంబయి, డిసెంబరు 31:** రోడ్డుపై ఇనుపమేకులు, గాజు వస్తువులు, ఇతర కారణాలతో వాహనాలు పంక్చర్ కావడం చూస్తుంటాం. ఒకటో, రెండో వాహనాలు దెబ్బతినడాన్ని గమనిస్తాం. కానీ, ఒకేసారి 50 వాహనాలు పంక్చర్‌కు గురైన ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకొంది. ముంబయి,నాగ్‌పూర్ సమృద్ధి హైవేపై జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల రాత్రి 10 గంటల ప్రాంతంలో వాషిం జిల్లాలోని మాలెగావ్ మీదుగా వెళుతున్న కార్లు, ట్రక్కులు వరుసగా పంక్చర్ అయ్యాయి.దీంతో రహదారిపై కొన్ని గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఎలాంటి సాయం అందకపోవడంతో రాత్రంతా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇనుప బోర్డు రోడ్డుపై పడి ఉండడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గామారాయి. ఈ సమాచారం అందుకున్న



పోలీసులు ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేదా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా ఈ చర్యకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ యేడాది జూన్‌లో జల్నా జిల్లాలోని ఇదే హైవేపై రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ముంబయి, నాగ్‌పూర్‌ను కలుపుతూ నిర్మించిన రోడ్డు ఇది. దేశంలోని అతి పొడవైన గ్రీన్‌ఫీల్డ్ రోడ్ ప్రాజెక్ట్‌లో భాగంగా దీన్ని నిర్మించారు. రూ.55వేల కోట్ల వ్యయంతో రహదారిని ఏర్పాటు చేశారు.

## కేరళ నర్స్ నిమిష ప్రియకు యెమెన్‌లో మరణశిక్ష

### ఆమెను విడిపించేందుకు కృషి చేస్తామన్న భారత్

**న్యూఢిల్లీ, డిసెంబరు 31:** యెమెన్‌లో ఓ హత్యా నేరంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయ నర్స్ నిమిష ప్రియాకు ఆ దేశాధ్యక్షుడు రషీద్ అల్ అలిమి మరణశిక్ష ఖరారు చేశారు. కేరళకు చెందిన ఈ నర్సును విడిపించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఓ హత్యానేరంపై దాదాపు 2017 నుంచి ఆమె యెమెన్ జైల్లో మగ్గుతోంది. కొన్ని నెలల్లోనే ఆమెకు శిక్ష అమలుచేయనున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ అంశంపై విదేశాంగశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. ప్రియను కాపాడేందుకు ఆ కుటుంబం అన్ని అవకాశాలను అన్వేషించడాన్ని అర్థం చేసుకోగలం. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తోంది అని పేర్కొన్నారు. నిమిష ప్రియ నర్స్ కోర్సు పూర్తి చేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరింది. 2011లో కేరళకు వచ్చి థామస్ అనే వ్యక్తిని వివాహం చేసుకొంది. ఆ తర్వాత ఆమె యెమెన్‌లో ఓ క్లినిక్ తెరవాలనుకుంది. కానీ ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి వ్యాపార భాగస్వామ్యమంతోనే అది సాధ్యమవుతుంది. దీంతో అక్కడి తలాల్ అదిబ్ మెహది అనే వ్యక్తిని



నిమిష,థామస్‌జంట తమ వ్యాపార భాగ స్వామిగా చేసుకుని అల్‌అమల్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత తమ కుమార్తెకు సంప్రదాయ వేడుక కోసం భారత్ వచ్చిన ప్రియా అది ముగియగానే తిరిగి యెమన్ వెళ్లిపోయింది. ఆమె భర్త, కుమార్తె మాత్రం కేరళలో ఉండిపోయారు. మెహది దీనిని అదునుగా భావించి ఆమె నుంచి డబ్బు లాక్కోవడంతోపాటు వేధించినట్లు ప్రియా కుటుంబం ఆరోపిస్తోంది.

## మంచు కుటుంబాన్ని ఇంకా వెంటాడుతున్న వివాదాలు

### అటవీ ప్రాంతంలో అడవి పందులను సిబ్బంది వేటాడిన దృశ్యాలు వైరల్



వేటాడిన అడవి పందులను తరలిస్తున్న దృశ్యం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), డిసెంబరు 31 ప్రభాతవార్త:** తెలుగు సినీ పరిశ్రమలో సీనియర్ నటుడు, నిర్మాత, మాజీ రాజ్యసభ సభ్యుడు మంచు మోహన్‌బాబు కుటుంబాన్ని ఇంకా వివాదాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే ఆ కుటుంబంలో తలెత్తిన వివాదాలు సద్దుమణగక ముందే తాజాగా కొత్త వివాదం వచ్చి పడింది. మంచు కుటుంబం నివాసం ఉంటున్న ఫాంహౌస్ సమీపంలోని ఫారెస్టు ఏరియాలో అడవి పందులను విష్ణు సిబ్బంది వేటాడారనేది బయట పడింది. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానిక జల్‌పల్లి గరిగుట్ట అటవీ ప్రాంతంలో పందులను వేటాడి వాటిని సిబ్బంది మోసుకువెళ్తూ వీడియాలో రావడం కలకలం రేపింది. విష్ణుకు సంబంధించిన మేనేజర్‌తో పాటు ఎలక్ట్రీషియన్, ఇంకా కొందరు అడవి పందులను వేటాడి వాటిని తరలిస్తున్నట్లు దృశ్యాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

ఈ ఘటనపై నెటిజన్లు మంచు మోహన్‌బాబు కుటుంబంపై ట్రోలింగ్‌లు చేస్తున్నారు. వన్యప్రాణుల చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు కూడా చేస్తున్నారు. మొత్తం మీద జల్‌పల్లిలోని మంచు ఫాంహౌస్ సమీపంలో అడవి పందులను వేటాడిన వ్యవహారం మోహన్‌బాబు కుటుంబానికి మరో తల నొప్పి అంశం అవుతోంది. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో అడవి పందుల వేట విషయమంలో వస్తున్న వార్తలపై పోలీసులుగానీ, అటవీశాఖ అధికారులు గానీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

## కొన్ని సంస్కరణలు.. మరికొన్ని విజయాలు

### ఆర్టీసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

### రవాణా శాఖకు ప్రత్యేక లోగో రూపకల్పన

### కొత్తగా ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ, స్క్రాప్ పాలసీలు

### 2024-రివ్యూ







**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2024లో రవాణా శాఖ పలు సంస్కరణల తోపాటు విజయాలతో ముగించింది. ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ, స్క్రాప్ పాలసీ వంటి సంస్కరణలతోపాటు రోడ్డు నిబంధనలు పాటించకపోతే డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు.. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా సాధికారతకు చర్యలు తీసుకుంది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో రవాణా శాఖ పలు విజయాలను సాధించిందని అధికారులు వార్షికాభివృద్ధిని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పటి వరకు 125.50 కోట్ల మంది మహిళలు.. రూ 4225 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేసిన రికార్డు నెలకొల్పారు. 2024 లో ప్రజా పాలనలో రవాణా శాఖ అత్యుత్తమ ప్రదర్శన కబర్చింది. రవాణా శాఖ నోటిపై చేసిన ఉద్యోగాలు 113 ఏఎంవీఐ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. అందులో 112 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారిలో 97 మంది అభ్యర్థులకు నియామకాలు జారీ చేయబడగా మరో 15 పోస్ట్‌లు ధృవీకరణలో ఉన్నాయి. టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ద్వారా 63 ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో 54 మంది అభ్యర్థులు ఇప్పటికే ఫిబ్రవరిలో డిపార్ట్‌మెంట్‌లో చేరారు. టీజీపీఎస్సీ గ్రూప్-4 కేడర్ ద్వారా నవంబర్‌లో 10 మంది జూనియర్ అసిస్టెంట్లు ఎంపికయ్యారు. మార్చి 15, 2024న తెలంగాణ వాహనాల కోసం వాహన రిజిస్ట్రేషన్ కోడ్‌లో "టీఎస్" నుండి "టీజీ"కి మార్పును రవాణా శాఖ ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో నమోదైన వాహనాలకు ప్రత్యేక గుర్తింపును కల్పించేందుకు ఈ మార్పును అమలు చేశారు. ఇప్పటివరకు 8,04,255 వాహనాలు టీజీలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రతి ఏడాది సగటున 5లక్షల వాహనాలు చేరడమే లక్ష్యంగా పెట్టుకుంది. కాలుష్యాన్ని తగ్గించడానికి మరియు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడానికి.. తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేయబడిన వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు 100శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులను మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రవాణా శాఖకు ఇప్పటి వరకు ప్రత్యేక లోగో లేదు. రవాణా శాఖకు ప్రత్యేకంగా కొత్త లోగోను మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ప్రభుత్వం ఆమోదించింది. తెలంగాణ ప్రభుత్వం వెహికల్ ఫ్లీట్ ఆధునీకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో రిజిస్టర్డ్ వెహికల్స్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్ (ఆర్‌వీఎస్‌ఎఫ్), ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్ (ఏటీఎస్) అమలు ఉంటుంది. రూ. 296 కోట్ల బడ్జెట్‌తో రాష్ట్రవ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లు (ఏటీఎస్) సౌకర్యాలు ఆమోదించబడ్డాయి. విద్యాశాఖ సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులను ఏర్పాటు చేయాలని డిపార్ట్‌మెంట్ నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుండి ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్,రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు 4577 డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేయబడ్డాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రస్తుతం ప్రతి రోజు సగటున 58 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి స్కీం ప్రారంభించక ముందు 45 లక్షల మంది రాకపోకలు సాగించేవారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ స్కీంను అమలు చేయడం వల్ల ప్రతి రోజు సగటున దాదాపు 12 లక్షల మంది ప్రయాణికులు పెరిగారు. ఏడాది కాలంగా 1389 కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చింది. మొదటిసారిగా హైదరాబాద్ శ్రీశైలం మార్గంలో 10రాజధాని ఏసీ బస్సులను ప్రవేశపెట్టడం జరిగింది. హైదరాబాద్ నుంచి పలు జిల్లా కేంద్రాలకు 75 డీలక్స్ బస్సు లను వాడకంలోకి తెచ్చింది. అలాగే రాజధాని హైదరాబాద్ లో 125 మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. కాలుష్య నివారణకు హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లో 251 ఎలక్ట్రిక్ బస్సు లను ఆర్టీసీ ప్రారంభించింది. హైదరాబాద్‌లో 353, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, సూర్యాపేటలో 446 ఎలక్ట్రిక్ బస్సులను 2025 మార్చి నాటికి అందుబాటులోకి రానున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ లో కాలుష్య నివారణ కోసం మొత్తం ఎలక్ట్రిక్ బస్సులను నడిపేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ ప్లాన్ చేస్తోంది. దశల వారీగా 2400 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీని ప్రకటించింది. 21 శాతం ఫిట్ మెంట్‌తో కూడిన వేతనాన్ని ఈ ఏడాది మే నెల నుంచి ఉద్యోగులకు సంస్థ అందజేస్తోంది. పీఆర్సీ వల్ల 42057 ఉద్యోగులకు, 11014 రిటైర్డ్ ఉద్యోగులకు లబ్ది చేకూరింది. ఆర్పీఎస్ 2013 బాండ్ల పెండింగ్ బకాయిలు రూ.280 కోట్లను విడుదల చేసి.. ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో నగదును జమచేసింది. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.కోటి ప్రమాద బీమాను సంస్థ అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 440 మందిని అవార్డులతో సత్కరించడం జరిగింది. ఆర్టీసీలో దాదాపు 12 ఏళ్ల తర్వాత 3038 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చింది. ఈ పోస్టులకు సంబంధించిన నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఏడాదిలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన, మెడికల్ అన్ ఫిట్ అయిన 557 వేల మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద సంస్థ ఉపాధి కల్పించింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు ములుగు జిల్లా ఏటూరునాగారంలో డిపోల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌లో మెట్రో ఎక్స్ ప్రెస్ జనరల్ పాస్ దారులకు ఏసీ సర్వీసుల్లో 10 శాతం రాయితీని ఇవ్వడం జరిగింది. ఎయిర్ పోర్ట్ మార్గంలో తిరిగే పుష్పక్ బస్సుల్లో ముగ్గురు అంత కన్నా ఎక్కువ మంది ఒకే సారి కలిసి ప్రయాణిస్తే టికెట్ లో 10 శాతం రాయితీని అందిస్తోంది. మెట్రో డీలక్స్ పాస్‌ను పునరుద్ధరించడం జరిగింది. పెళ్లిళ్లు, ముహుర్తాలు, విహారయాత్రల కోసం బస్సులను బుక్ చేసుకునే బస్‌ఆన్ కాంట్రాక్ట్(అద్దెకు బస్సులు) చార్జీలను సంస్థ తగ్గించింది. ఏడాదిలో బస్ ఆన్ కాంట్రాక్ట్ కింద 15171 బస్సులను పెళ్లిళ్లు, ముహుర్తాలు, విహారయాత్రల కోసం అద్దెకు ప్రజలు బుకింగ్ చేసుకున్నారు. కార్గో సేవలను మరింతగా విస్తరించడంలో భాగంగా రాజధాని హైదరాబాద్‌లో పార్శిళ్ల హోం డెలివరీ సదుపాయాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ప్రసిద్ధమైన మేడారం జాతరకు భక్తుల సౌకర్యార్థం 3515 ప్రత్యేక బస్సులను సంస్థ నడిపింది. 19 లక్షల మంది భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసింది. శ్రీరామనవమి సందర్భంగా 47,092 మంది భక్తులకు భద్రాద్రి రాములోరి తలంబ్రాలను లాజిస్టిక్స్ విభాగం అందజేసింది.

## రాష్ట్ర వ్యాప్తంగా సావిత్రి బాయిపూలే విగ్రహాల ఏర్పాటు

### 3న హైదరాబాద్‌లో జయంతి: జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చదువుల తల్లి సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. సావిత్రి బాయి పూలే 194వ జయంతి ఉత్సవాలను ఈనెల 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బడుగుల జీవితాల్లో వెలుగులు నింపి తమ విలువైన జీవితాలను త్యాగం చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహాలను తెలంగాణ రాష్ట్రంలో ఊరూరా నెలకొల్పుతామని తెలిపారు. మంగళవారం హైదరాబాదులోని బిసి భవన్ లో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగే సావిత్రి బాయి పూలే రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవ బ్రోచర్‌ను శ్రీనివాస్‌గౌడ్ మహిళ సంఘాల నేతలతో కలిసి ఆవిష్కరించారు. దేశంలో మొదటగా మహిళలకు చదువులు నేర్పి సమాజ హితం కోసం అణగారిన వర్గాల జీవితాలను మెరుగుపరచడం కోసం తమ విలువైన జీవితాన్ని త్యాగం చేసిన మొట్టమొదటి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. జనవరి మూడో తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించాలన్నారు.బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బిమని మంజరి మాట్లాడుతూ ఈ నెల 3న రవీంద్రభారతిలో ఉదయం 11గంటల నుండి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

